వేంకటేశ్వరస్వామికి పల్లకి సేవ


పల్లకి సేవలో చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: యంనంపేట్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా అన్నదాతలు ఉప్పునూరి అంజలి కుటుంబ సభ్యులను చైర్మన్ కొండల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం కోరుతున్నట్లు చెప్పారు. ఆలయ చైర్మన్ రాజేష్‌గౌడ్, నిర్వాహకులు చంద్రారెడ్డి, పాలకూర వెంకటస్వామి, సగ్గు రవీందర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో సత్తాచాటిన విద్యార్థులు

బోడుప్పల్: బాబురావు సాగర్ గ్రౌండ్‌లో జరిగిన ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌లో పల్లవి మోడల్ స్కూల్ టీం సత్తా చాటినట్లు కోచ్‌లు సురేష్, వెంకట్ వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో బెంగుళూరు, ఔరంగాబాద్, మహారాష్ట్ర, నాందేడ్, హైదరాబాద్ నుంచి 8 టీమ్‌లు పాల్గొన్నాయి. పోటీల్లో పల్లవి మోడల్ టీం కప్ గెలవగా క్రికెట్ టోర్నమెంట్ లీగ్ సభ్యులు వారిని అభినందించారు.

పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్!

ఇప్పటివరకు పేరుకుపోయిన బకాయిలు, పన్నులపై దృష్టి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై కార్యాచరణ ప్రణాళికపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. వచ్చే మార్చితో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేందుకు పురపాలక సంఘాలు, జీపీలు ప్రత్యేక డ్రైవ్‌పై దృష్టి సారిస్తున్నాయి. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపడం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళలో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తోంది. మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో.. ప్రజాపాలన కార్యక్రమం ముగిసిన తర్వాత బృందాలను రంగంలోకి దింపి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల కారణంగా దాదాపు మూడు నెలలు పన్నుల వసూళ్లకు బ్రేక్ పడింది. త్వరలో పార్లమెంట్, పంచాయతీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో.. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. లేనిపక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్నుల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

- ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల లక్ష్యం రూ.202 కోట్లు
- ఇప్పటి వరకు పన్ను వసూలైంది.. 60 శాతం మాత్రమే..
- ప్రజాపాలన ముగియగానే స్పెషల్ డ్రైవ్‌తో రంగంలోకి బృందాలు
- మూడు నెలల్లో వంద శాతం లక్ష్యంపై కార్యాచరణ ప్రణాళిక



పన్నుల లక్ష్యం రూ.202 కోట్లు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలతో పాటు 61 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.202 కోట్లు కాగా, ఇప్పటి వరకు 60 శాతం పన్నుల వసూళ్లు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల కారణంగా మూడు నెలలు పన్నుల వసూళ్లకు ఫుల్‌స్టాప్ పడగా, వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఆలోగా వంద శాతం పన్నుల వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి రెండు శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటేటా పెరిగిపోతున్నాయి.

పేరుకుపోయిన వాటితో కష్టాలు..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ఏటా సకాలంలో పన్నులు వసూలు కావడం లేదు. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్ పడుతోంది. దీనికితోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడుతోంది. అలాంటి పరిస్థితుల నుంచి పట్టణాలు, జీపీలు అధిగమించాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.

మహిళలకు అండగా సఖీ సెంటర్లు


యువతులకు అవగాహన కల్పిస్తున్న సఖీ ఇన్‌చార్జి సలోమి

మేడ్చల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సఖీ కేంద్రాలు మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటాయని సఖీ కేంద్రం మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి సలోమి అన్నారు. పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమశాఖతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు సఖీ కేంద్రం నిర్వహిస్తున్నామని, బాధిత మహిళలకు అండగా ఉంటూ వారికి భరోసా కల్పిస్తున్నామని అన్నారు. సమాజంలో మహిళలు, బాలికలు, యువతులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు, ఇబ్బందులను సఖీ కేంద్రం పరిష్కరించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. సభ్యురాలు సౌజన్య, కరస్పాండెంట్ కమలాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దేవరాజు తదితరలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందనలు


వలంటీర్లతో కో ఆర్డినేటర్ మల్లేశ్, డీన్ వసుధ భక్షి

ఘట్‌కేసర్: న్యూఢిల్లీలో జరగనున్న ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ రెండో సంవత్సరం విద్యార్థిని అఖిల ఎంపికయ్యారు. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ క్యాంపులో పాల్గొని ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా అఖిలతో పాటు వివిధ జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ క్యాంపునకు ఎంపికైన వలంటీర్లను ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, ఫార్మసీ డీన్ వసుధ భక్షి ఆధ్వర్యంలో శనివారం సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు నవీన్, బాబా శంకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల వితరణ


గిర్మాపూర్ అక్షింతల శోభాయాత్ర


నాగారం మున్సిపాలిటీలో అయోధ్య రాముల అక్షింతల ఊరేగింపు


సంస్కృతి టౌన్‌షిప్‌లో కౌన్సిలర్ హరిప్రసాదరావు తదితరులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర అయోధ్య శ్రీరాంలీలా మందిరంలో ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ పూజిత అక్షింతల వితరణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. టౌన్‌షిప్‌లోని శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి పోచారంలోని శివాలయం వరకు నగర సంకీర్తన, శివాలయం వద్ద అక్షింతల స్వీకరణ, తుది నగర సంకీర్తనతో వేంకటేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు ఊరేగింపుగా చేరుకుని అక్షింతల వితరణ చేశారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం పూర్తయినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షింతల ఊరేగింపు..

కీసర: నాగారం మున్సిపాలిటీలో అయోధ్య రాముల వారి అక్షింతల ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ, టీచర్స్‌కాలనీ, రామలింగేశ్వరస్వామి, సింహపురికాలనీ తదితర కాలనీల్లో అయోధ్య రాముల వారి అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిర్మాపూర్‌లో అక్షింతల శోభాయాత్ర

మేడ్చల్: అయోధ్య రామమందిరం పూజిత అక్షింతల శోభాయాత్రను మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో నిర్వహించారు. గ్రామంలో ఆలయంలో పూజలు నిర్వహించి అన్ని వీధుల్లో ఊరేగించారు. గ్రామంలో అన్ని పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం


విక్రాంత్(ఫైల్)

జవహర్‌నగర్: బాలుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకూర్‌కు చెందిన విక్రాంత్(12) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిహారం చెల్లించాలని నిరసన

ఘట్‌కేసర్: మృతుడి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని పట్టణంలోని ఓ మార్ట్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు శనివారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఓ ప్రైవేటు మార్ట్‌లో జనగాం కంచనపల్లికి చెందిన చాగంటి రాజు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా హెచ్‌ఆర్ సందీప్‌రెడ్డి వేధిస్తున్నాడని, ఒత్తిడితో ఆస్పత్రిలో చేరాడు. నాలుగు రోజులు వైద్యం పొంది శనివారం మృతి చెందగా కుటుంబ సభ్యులు పరిహారం చెల్లించాలని మార్ట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మార్ట్ ఎదుట నిరసన చేస్తున్న మృతుడి బంధువులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడం సంతోషకరం


మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులు

శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి, మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్(అటానమస్) కళాశాలలో శనివారం అల్యూమ్ని మీట్ ఘనంగా జరిగింది. కళాశాల పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవి మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుని సహకారం అందించాలని, తమ కళాశాలలో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగడం సంతోషకరమని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ అనుభవాలతో పాటు మధురానుభూతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్, హెచ్ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

మేడ్చల్: ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని కోరుతూ సీఎంఆర్‌టీసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు అవగాహన కల్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లాస్టిక్ వాడొద్దంటూ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల చేకూరే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకూడదని ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఆర్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్లు రాజిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సాహుల్‌మోపిదేవి, పీఆర్ఓ దుర్గాప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


కండ్లకోయలో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మార్పులను శరవేగంగా అందిపుచ్చుకోవాలి


మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌లో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: సైన్స్ ఫెయిర్లతో విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధన పట్ల ఆసక్తి పెరుగుతుంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకొని విద్యార్థులు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎం సత్యప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు మిలన్, రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసే నమూనాలు


బచ్‌పన్ అకాడమిక్ హైట్స్‌లో సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న స్కూల్ రీజనల్ డైరెక్టర్ రూపరెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్లో శనివారం సైన్స్ ఫెయిర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ రీజనల్ డైరెక్టర్ రూపరెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి పాల్గొని విద్యార్థులు చేసిన పలు నమూనాలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ నమూనాలు ఆలోచింపజేసేలా ఉన్నాయని, విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టి ముందుకు సాగాలని వారు కోరారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించడం మంచి పరిణామం అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని అంశాలపై అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోత్స్నదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం ఆరు గ్యారంటీలు


మేడ్చల్‌లో మహిళలతో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్


నాగారంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్

మేడ్చల్: ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ఆరు గ్యారంటీల కోసం నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలలో అర్హులందరూ తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు.

అన్ని ప్రాంతాల్లో ప్రజాపాలనకు స్పందన

ప్రజాపాలన పేరుతో గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోందని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండలంలోని రావల్‌కోల్ గ్రామసభలో పాల్గొని ఆమె అభయ హస్తం దరకాస్తు ఫారాలను స్వీకరించారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలజ, సర్పంచ్ మహేందర్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన నిర్వహణపై ఆరా..

ఘట్‌కేసర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సాబేర్ అలీతో కలిసి ఎన్ఎఫ్‌సీనగర్‌లో శనివారం పరిశీలించారు. అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఘట్‌కేసర్‌లో పరిశీలించి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంగీత, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, వీరేశం. హబీబ్, పవన్, జహంగీర్, అస్లాం, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తులు అందజేయాలి

కీసర: అర్హులు 6 గ్యారంటీలకు దరఖాస్తుల అందజేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 5, 6 వార్డుల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఇప్పటివరకు 3,748 దరఖాస్తులు అందినట్లు కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఇప్పటివరకు 2,271, దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందజేస్తాం..

శామీర్‌పేట్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శామీర్‌పేట మండలం, బొమ్మరాశిపేటలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామస్తులకు 6 గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ గీత, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.


రావల్‌కోల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ


ఘట్‌కేసర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య


బొమ్మరాశిపేటలో దరఖాస్తులను స్వీకరిస్తూ..

ఫ్యాషన్ వస్త్రాల వైపు యువత మొగ్గు


వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎండీ రాజమౌళి

ఉప్పల్: అన్ని వయస్సుల వారు ఫ్యాషన్ వైపు మొగ్గు చూపుతున్నారని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎండీ రాజమౌళి అన్నారు. ఫ్యాషన్‌కు మారుపేరైన సెలబ్రిటీ వస్త్ర దుకాణాన్ని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఎండీ రాజమౌళి, డీఎస్ఎల్ వర్చుమాల్ ఎండీ మనోజ్ అగ్రవాల్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాషన్‌కు నేటి యువత పెద్దపీట వేస్తోందని, అన్ని వయస్సుల వారి దృష్టి ఫ్యాషన్ రంగంవైపు ఉందన్నారు. దానికి అనుగుణంగా సరికొత్తగా దుస్తులను అందించే సంస్థలు మన్ననలుగుతున్నాయన్నారు. ఉప్పల్‌లో డీఎస్ఎల్ మాల్ సెలబ్రిటి షాపు ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం సెలబ్రెటి షాపు నిర్వాహకులు నవీన్ పోలెపల్లి, ప్రవీణ్ మాట్లాడుతూ అన్ని రకాల టాప్ బ్రాండెడ్ దుస్తులను అందిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 350 వరకు స్టోర్‌లు ఉన్నట్లు తెలిపారు. నమిత్ బ్రెట్ ఫెలీస్ డైలాన్ జాసన్ (మోడల్ నటుడు), సుశీల్ బోకాడియా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సెలవు దినాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాట్య గురువు శ్రీవిద్యా కిడంబి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. రంగపూజ, మండూక శబ్దం, గణేశా, కౌతం, మూషిక వాహ న, జతిస్వరం, లింగాష్టకం లాంటి అంశాలను ప్రణవి, హంసిని, చందన, సువర్షిణి, జ్యోతి, నూతన, కావ్య, ఛాయ, ఆద్వి, అవని ప్రదర్శించి మెప్పించారు.



ఘనంగా హోమియో మెడికల్ కళాశాల వార్షికోత్సవం

రామంతాపూర్: ప్రధాన రహదారిలోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన టీఎస్ వీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప, కార్పొరేటర్ కక్కిరేణి చేతన హాజరై ఉత్తీర్ణులైన వైద్య విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలి

రామంతాపూర్: కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి స్థానిక గణేష్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఒక్క దరఖాస్తుతో అన్ని రకాల సంక్షేమ పథకాలకు అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంది ఆగిరెడ్డి, బాలయ్య, రఘుపతి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

ఉప్పల్: ఉప్పల్ చర్చస్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ గోన ఫిలిప్స్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని హూరేబు మినిస్ట్రీస్‌లో నిర్వహించిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమానికి ఉప్పల్ కాంగ్రెస్ నేత మందుముల పరమేశ్వర్‌రెడి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్జె వెంకటరెడ్డి, సంపత్, వసంత్ కుమార్, డా.సాలోమెను, జంపాల శ్రీనివాస్, అనిల్, జెరుషలేమ్ మత్తయ్య పాల్గొన్నారు.

8 కిలోల గంజాయి స్వాధీనం

మల్కాజిగిరి: మల్కాజిగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం పరిధిలో శనివారం 8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు డీటీఎఫ్, ఎస్టీఎఫ్ బృందం తనిఖీలు చేసిన సమయంలో నేరెడ్‌మెట్ ఆర్‌కేపురం బ్రిడ్జి వద్ద ప్రయాణిస్తున్న కారులో ఆరు కిలోలు, మల్కాజిగిరి అనుటెక్స్ వద్ద ద్విచక్ర వాహనం మీద వెళ్తున్న ధూల్‌పేట్‌కు చెందిన అనిష్‌సింగ్ వద్ద 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి ధన్‌రాజ్‌సింగ్ పరారయ్యాడని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఏఎస్పై ముకుందరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మోహన్‌బాబు, భరత్‌భూషన్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ధన్‌రాజ్ పాల్గొన్నారు.